# కోరిక

'ఇదా వాడు అమెరికాలో చేసిన ఘనకార్యం!'

'త్రాష్టుడు! మన కుటుంబంలో యిలాంటిది ఎన్నడైనా విన్నామా? తులసి వనంలో గంజాయి మొక్కలా పుట్టుకొచ్చాడు.'

'ఇంతకూ వాణ్ణి అక్కడికి పంపడం మనం చేసిన పెద్ద పొరపాటు.'

ఇలా పిన్నా పెద్దా అందరూ అక్షింతలు చల్లారు. 'ఇక్కడ కాలేజీలో చదివే రోజుల్లోనే వాడు వెధవ తిరుగుళ్ళు తిరిగేవాడు. తెలిసీ అక్కడికి పంపించడం మన అవివేకం, మనందరికీ చెడ్డపేరు తెచ్చాడు ...'

అప్పుడే జ్ఞానోదయం అయిన మహనీయుడిలా ఫోజుపెట్టి, ఇంతకూ అమ్మకీ సంగతి తెలిస్తే కొంపలంటుకు పోవు! ఆవిడకిది తెలియక పోవడం మనందరికీ మంచిది...అసలు వుత్తరం వచ్చినట్లు ఆవిడకి తెలిపారో, ఆ తరువాత నేను మనిషిని కాను...' అన్నాడు ఆవిడ పెద్ద కొడుకు రామనాథం.

ఆ తర్వాత నాలుగైదు క్షణాలు మౌనం అలుముకుంది.

అమ్మ పక్కింటికి వెళ్ళిందా?'

'గదిలో పడుకున్నారు,' ఆయన భార్య సమాధానం చెప్పింది, గది వంక చూస్తూ.

'మన మాటలు ఆవిడగారికి వినబళ్ళేదు గదా!'

'వినిపిస్తే మనమేం చెయ్యాలి?'

'అదే నేను ఆలోచిస్తున్నాను...' మాట పూర్తి చేసేలోపల, ఆయన పెద్ద కూతురు గదిలోకి వెళ్లి చూసి వచ్చింది. 'నాయనమ్మ సరిగా నిద్ర పోయినట్లు లేదు...'

ఆ మాటలు అక్కడున్న వారందరికీ బాణాల్లా గుచ్చుకున్నాయి. ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు. ఏం చెయ్యాలా అని ఆలోచనలో పడ్డారు. కర్తవ్యం తెలీక తికమక చెందారు.

అసలు సంగతి తెలిస్తే అమ్మ మనస్సు గాలిలోని దీపంలా కొట్టుకుంటుంది. అదీ పెద్ద కొడుకు బాధ. ఈ అవమానం అమ్మ ఎలా భరిస్తుంది? ఇది రెండో కొడుకుని వేధించుకు తిన్న ప్రశ్న. అత్తగారు ఏదన్నా అఘాయిత్యానికి పాల్పడతారో యేమిటో–పెద్ద కోడలికి కలిగిన సందేహ మిది. పాల్పడతారో యేమిటి, అవిడగారి మనస్సు నాకు తెలీదూ–రెండో కోడలి తీర్పిది! ఇంకా మరికొన్ని ధర్మ సందేహాలు వెలువడి వుండేవే...అమ్మ మన దగ్గరికే వస్తోంది అన్న పెద్ద కొడుకు మాటలతో అందరి నోళ్ళకు తాళాలు పడ్డాయి. ముఖంలో నెత్తురు చుక్క లేనివాళ్ళలా కనిపించారు. దిష్టిబొమ్మలయ్యారు. చెయ్యరాని పనిచేసి నపుడు సంఘానికి ఎలా భయపడతారో ఆ కుటుంబ సభ్యులే ప్రత్యక్ష తార్కాణం!

'ఏరా రామూ, తమ్ముడు ఏం రాశాడు?' రామనాథం అవాక్క య్యాడు. అమ్మకు ఏం బదులు చెప్పాలో అతనికి తోచలేదు. తమ్ముడి వంక చూశాడు.

'అమ్మా, తమ్ముడు నీ పేరుకి వుత్తరం రాశాడు...'

'నాకు సంగతి తెలుసు. ఏం రాశాడని అడుగుతున్నా' ఆవిడ మాటలో అదుర్దా తొంగి చూసింది.

'నాయనమ్మా..మరే...బాబాయి.....'

మనమరాలు చెప్పసాగింది. అసహనంగా ఆవిడ. 'బాబాయి ఏం చేశాడు?' అనే సరికి సమాధానం చెప్పాలనుకున్న మనమరాలు భయం భయంగా తండ్రి వంక చూసింది. 'మరిదిగారు అమెరికా అమ్మాయిని పెళ్ళి చేసుకుంటారట. మీ పర్మిషన్ కోరుతూ వుత్తరం రాశారు' కుండ బద్దలు కొట్టినట్లుగా రెండో కోడలు చెప్పింది.

ఒక్కసారిగా అందరినీ భయం ఆవహించింది. ఆదుర్దా వారి ముఖాలలో కొట్టవచ్చినట్లు కనిపించింది. పెద్ద కొడుకైతే తల్లిని చూడలేక పోయాడు.

'అమెరికా అమ్మాయంటే ఆ దేశస్థురాలా, యిక్కణ్ణించి వెళ్ళి అక్కడ వుంటున్న వాళ్ళా...? అని అత్తగారు సూటిగా ప్రశ్నించేసరికి, రెండో కోడలు గుండెలో రైళ్ళు పరిగెత్తాయి.

'అక్కడే పుట్టి పెరిగిన ఆ దేశస్తురాలే' విడమరిచి చెప్పింది, కూడ గట్టుకున్న ధైర్యంతో.

'నువ్వు వుత్తరం సరిగా చదవలేదనుకుంటాను,' ఆమె భర్త నసిగాడు.

'చదవక పోవడమేంటి, రెండుసార్లు చదివా ఆ పేరా. 'అంటే అమ్మాయి ఆదేశస్థురాలే, కాని అమ్మాయి తండ్రి మనవాడే...'

'అంటే భారతీయుడా!'

'భారతీయుడే కాదు, మన జిల్లాకు చెందిన వాడే....'అయితే ఆయన అక్కడికి వెళ్ళి చాలా కాలమయిందట.....'

'అలా అనుకుని మీరు తృప్తి పడుతున్నారన్న మాట!' ఆమె మాటలో వెటకారం ధ్వనించింది.

'నువ్వు లేనిపోని అర్థాలు తీసి వేధించకు' అసహనంగా అన్నాడు.

'మీ తమ్ముడిమీది విసుగుని కోపాన్ని నామీద చూపి యేం లాభం? అందరికీ తలవంపులు తెచ్చేపనిచేసి కూర్చున్నాడు మీ తమ్ముడు...'

'మీ తమ్ముడు మాత్రం?'

'వాడేం ముక్కూ మొగం తెలీని అమెరికా పిల్లని వరించలేదు. మన కులం కాకపోతే మాత్రమేం, మన దేశం అమ్మాయినే లక్షణంగా పెళ్ళి చేసుకుని మనకంటే గొప్పగా కాపరం చేస్తున్నాడు...'

ఆవిడ 'రాము' అన్నది మామూలుగా. మామూలుగా అన్న ఆ మాటే అక్కడున్న వాళ్ళకి పిడుగులా తోచింది. దాంతో వాదోపవాదాలు ఠపీమని ఆగిపోయాయి. అందరి చూపులు ఆవిడమీదే నిలిచాయి.

'రామూ'

'అమ్మా!' ఆదుర్దాగా చూశాడు రామనాథం. 'వెళ్ళి ఒక ఆటో పిలుచుకురా.' ఎందుకని అతను అడగలేక పోయినా, రెండో కొడుకు మాత్రం అడిగాడు.

ఆవిడ మందహాసం చేసింది.

'ఈ మధ్య ఎక్కడికీ కదలని నేను యివ్వాళ ఎక్కడికో వెళ్ళాలనుకోవడం వింతగా వుందా..?'

'అవును. ఈ మధ్యకాలంలో అత్తగారు గడపదాటి ఎరుగరు. ఎప్పుడు చూసినా ఏదో ఆలోచిస్తున్నట్లు కనిపిస్తున్నారు...' అంది పెద్ద కోడలు.

'ఇహ ఏ ఆలోచనలతోనూ పని లేదు...' అని ఆవిడ అనేసరికి కొడుకులూ కోడళ్ళూ ప్రశ్నార్థకంగా చూశారు. ఆవిడలో ఏదో మార్పు వచ్చినట్లు మాత్రం గ్రహించ గలిగారు.

'అమెరికా కోడలు పిల్లకి కంచి పట్టు చీర కొనాలి. మంగళ సూత్రానికి ఆర్డరివ్వాలి...'

'అమ్మా, నువ్వు ఒప్పుకుంటున్నావా యీ పెళ్ళికి ?' ధైర్యంచేసి అడిగాడు రామనాథం.

'ఇందులో తప్పేముంది? కోడలికి చీర కొనడం సబబే. మంగళ సూత్రమూ అవసరమే...'

'నిజమే అనుకో...కాని...'

'అమెరికా అమ్మాయికి యివన్నీ ఎందుకనేగా నీ సందేహం.'

అవునన్నట్లుగా కొడుకు తల్లిని చూశాడు.

'నీ భార్య నాకు కోడలు. నీ తమ్ముడి భార్య కూడా కోడలే. అలాగే వాడి భార్య మాత్రం కోడలు కాక పోతుందా?'

'అది కాదు నా సందేహం...'

'మీ సందేహమేమిటో నాకు తెలుసు. మన మతానికి చెందని అమ్మాయికి యివన్నీ అవసరమని అనుకుంటున్నావేమో...'

'పైకి చెప్పడానికి బావగారు తటపటాయిస్తున్నారు గాని, నా అభిప్రాయం ముమ్మాటికీ అదే...' అంది కోడలు.

'మీ యందరికీ ఎలా చేశానో, ఆ కోడలికీ అలాగే చెయ్యాలని నా కోరిక. వాడు యిష్టపడి పెళ్ళి చేసుకోవాలనుకున్న అమ్మాయి, ఎవరు కాదనుకున్నా, నాకు కోడలే. ఇది నా ముద్దూ ముచ్చటా' మనోభావ్రాయాన్ని స్పష్టం చేసింది. రెండో కోడలు మౌనం వహించక తప్పలేదు.

'రామూ, కాగితం కలం యిలా తీసుకురా, ఉత్తరం రాస్తాను.'

'నువ్వు చెప్పు. నేను రాస్తాను' అంటూ లేఖ వ్రాయడానికి సంసిద్ధుడయ్యాడు

ప్రత్యుత్తరం వ్రాసే ముందు ఒక్కసారి కొడుకుచేత ఉత్తరం చదివించుకుంది. శ్రద్ధగా వింది. సమాధానం చెప్పడం మొదలు పెట్టింది.

చిరంజీవికి ఆశీర్వచనాలు.

మీకు నచ్చిన అమ్మాయి నాకూ నచ్చినట్లే. ఆమెను చూడకపోయినా, కనుముక్కు తీరు బాగున్నట్లే నీ వుత్తరం బట్టి గ్రహించాను. కోడలికి కంచిపట్టుచీర మంగళసూత్రం త్వరలోనే పంపిస్తాను. అందరికీ అంగీకారమైతే పెళ్ళి మన దేశంలోనే జరిగితే చాలా సంతోషిస్తాను. మన బంధువులు ఏమనుకున్నా సరే, నేనే దగ్గరుండి మీ పెళ్ళి జరిపిస్తాను. ఒక వేళ అలా జరగని పక్షంలో, అక్కడికి రావడానికి నేను ప్రయత్నిస్తాను. నా కళ్ళముందే మీ వివాహం జరగాలని నా అభిలాష... ఇట్లు...

ఆవిడ అంత సులభంగా అమెరికా అమ్మాయిని కోడలుగా స్వీకరిస్తుందని వాళ్ళెవ్వరూ అనుకోలేదు. అందుకే ఆశ్చర్యంలో మునిగిపోయారు.

'ముద్దుల కొడుకు కాబట్టి అమెరికా అమ్మాయిని కోడలుగా ఒప్పుకున్నారు' అంటూ నసిగింది రెండో కోడలు.

'ముగ్గురూ నాకు ముద్దుల కొడుకులే' అంటూ మొదలుపెట్టింది ఆవిడ.

'కోపంవచ్చి నప్పుడల్లా నువ్వు మా పుట్టింటికి వెళ్ళి పోతా వెళ్ళిపోతానంటూ బెదిరించినా సహించి వూరుకున్నా, కారణం నీ మొగుడు నాకు ముద్దుల కొడుకు కావడమే. మీ బావగారూ నాకు ముద్దుల కొడుకు కావడం వల్లనే, అప్పుడప్పుడు మీ తోడికోడలు నా మీద విసుక్కున్నా మాటలన్నా నోరు మూసుకు కూర్చున్నా. రేపు అమెరికా కోడల వల్ల గొడవ యేమన్నా జరిగినా మూగదానిలా కూర్చుంటాను. సంసారమన్న తర్వాత సర్వ సాధారణంగా జరిగే విషయాలే యివన్నీ...'

కోడళ్ళు మౌనం వహించారు.

'నేను ఒక రోజున కోడల్నే. అప్పుడు మా అత్తగారిని బెదిరించాను. విసుక్కున్నాను. మాటలన్నాను. సంసారమంటే యేమిటో అసలు విషయం యిప్పటికి గ్రహించాను...ముగ్గురు కొడుకులూ నాకు సమానమే..కోడళ్లూ అంతే...'

గత విషయాలు నెమరు వేసుకుంటున్న దానిలా కనిపించిన ఆవిడ నిర్వికారంగా యిలా అంది. 'ఇప్పుడవన్నీ గుర్తుకొచ్చే కొద్దీ ఎంత అవివేకంగా ప్రవర్తించానో అర్థమవుతోంది...కాని...మా అత్తగారంటే అప్పుడూ యిప్పుడూ ఎపుడూ నాకు గౌరవమే. ఆవిడ గొప్పతనం నాకు బాగా బోధపడుతోంది. నేనంటే మీకు అలాంటి ఆదర భావం వుందో లేదో నాకు తెలీదు...నా ధర్మం నేను నిర్వర్తించాను...'

రెండు మూడు క్షణాలు గడిచాయి. రామూ అంటూ సాభిప్రాయంగా చూసింది.

'అమ్మా!'

'ఒక్కసారి నా పెట్టె తీసుకు వస్తావ్...రామనాథం ఆవిడ గదిలోకి వెళ్ళి పెట్టె తీసుకు వచ్చాడు క్షణాలమీద.

పెట్టె తెరిచింది. గుడ్డల క్రింద దాచి వుంచిన చిన్న మూటలోంచి వంద రూపాయల నోట్లు పైకి తీసింది. ఆ బొత్తిలో ఎన్ని వున్నాయో యేమిటో! పది పదిహేను నోట్లు మాత్రం తీసి తనవద్ద వుంచుకుంది. మిగిలిన వాటిని కొడుకు చేతికిస్తూ, 'బాబూ, కాబోయే కోడలికి కావలసిన చీర, మంగళసూత్రం మొదలైనవి యిందులోంచే కొను...' రామనాథం ఆ నోట్లు లెక్కపెడుతుంటే ఆవిడ అంది గదా! 'రాము నేనంటున్నానని ఏమీ అనుకోకు...ఈ మిగిలిన పైకం కూడా నీకిస్తున్నాను. ఒక వేళ తమ్ముడి పెళ్ళికని నేను అమెరికా వెడితే, ఏ కారణం వల్లనైనా తిరిగి రాలేక పోతే, నాపేరు చెప్పి ఒక పేదవాడి చేతిలో యీ పైకం వుంచు...ఇదే నా కోరిక.'